సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 28 । అక్టోబర్ । 2024



ఆగని ఇసుక దందా

సరుబుజ్జిలి మండలంలో ఇసుక దందా ఆగడం లేదు. తవ్వి అక్రమంగా అమ్ముకుంటున్నారు. - 8లో



చిట్టి పాపకు పెద్ద కష్టం

ఒకటో తరగతి పాప బ్రెయిన్ ట్యూమర్‌తో బాధ పడుతోంది. చికిత్సకు తల్లిదండ్రులు సాయం కోరుతున్నారు. - 8లో



గడ్డి మందు తాగి..

గడ్డి మందు తాగి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. చదువు రావడం లేదనే మనస్తాపమే కారణం. - 8లో

న్యూస్‌రీల్

జాగ్రత్తలు పాటిద్దాం: ఎస్పీ



శ్రీకాకుళం క్రైమ్ : దీపావళి పండగను జాగ్రత్తగా జరుపుకుందామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. పోలీసు, సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందిన తర్వాత మాత్రమే బాణసంచా విక్రయించాలని, షాపులను మైదానం లేదా ప్రజల నివాస ప్రదేశానికి దూరంగా ఉన్న బహిరంగ చోటులో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షాపుల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని, తగినంత ఇసుక, నీరును డ్రమ్ముల్లో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఇంటి వద్ద ఎవరూ బాణసంచా తయారు చేయకూడదని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు పొందిన, నాణ్యమైన బాణసంచాను మాత్రమే కొనాలని సూచించారు.

కార్తీక ఉత్సవాలకు ముస్తాబు



ఆలయంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

జలుమూరు: పవిత్ర కార్తీక మాస ఉత్సవాలకు శ్రీముఖలింగం ముస్తాబవుతోంది. నవంబరు రెండు నుంచి కార్తీక మాసం ప్రారంభం నేపథ్యంలో స్వామి దర్శనం సులవుగా జరిగేందుకు బారికేడ్లు, క్యూలైన్ పనులు ప్రారంభించారు. సోమవారం నాటికి పూర్తి చేస్తామని ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. మరో రెండు రోజుల్లో బారికేడ్లు చలువ పందిళ్లు, షామియానాలు తదితర పనులు పూర్తి కానున్నట్లు ఆలయ సిబ్బంది చెబుతున్నారు.

ఉప కులాలను విడగొట్టవద్దు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు

పలాస: సమాజంలో ఉన్న ఉపకులాలని విడగొట్టి పాలక వర్గాలు తమ పబ్బం గడుపుకోవద్దని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఎస్సీ కులాల రిజర్వేషన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునకు పార్లమెంటు మాజీ సభ్యులు జీవీ హర్ష కుమార్, రిటైర్డు ఐడీఎస్ పీఎస్ఎన్ మూర్తి, ప్రొఫెసర్ జాన్ పాల్గొని కులాల మధ్య అంతరాలు, వాటి సమస్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను చెప్పారు. ఈ కార్యక్రమంలో పిలక కృష్ణారావు, మట్టజీవన బాబు, తౌలసి ప్రకాశరావు, బేరి అప్పారావు, తెప్ప పాపారావు, తుంగాన శంకరరావు, చెల్లూరి పద్మలోచన్, బోకర దుర్యోధన, నగిరి తారకరామారావు, దేవరాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 13న తెప్పోత్సవం



ఇంద్రపుష్కరిణి పరిసరాలను పరిశీలిస్తున్న ఈఓ భద్రాజీ, ప్రధాన అర్చకులు శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో నవంబరు 13న ఆదిత్యుని హంస నావికోత్సవం(తెప్పోత్సవం) నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వై.భద్రాజీ, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఇంద్రపుష్కరిణిని భద్రాజీ, శంకరశర్మలు పరిశీలించారు. ఇంద్రపుష్కరిణిలో హంస నావ ప్రదక్షిణలకు వీలుగా నీటి మట్టంతో ఇంద్రపుష్కరిణిని సిద్ధం చేశామని తెలిపారు. వేలాదిమంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో త్వరలో పలు ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి ఘనంగా ఉత్సవాన్ని జరిపేందుకు చర్యలు చేపడతామన్నారు.

సురేష్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు

శ్రీకాకుళం క్రైమ్ : టీడీపీ కక్ష సాధింపులు ఎదుర్కొంటున్న సనపల సురేష్‌కు శనివారం రాత్రి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సెక్షన్లు కూడా తగ్గించింది. పోలీసులు 41 నోటీస్ ఇచ్చి ఇంటికి పంపించేశారు. శనివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సురేష్‌ను విచారణకని పిలిచి ఆవరణ బయటే రూరల్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

● ఖాకీల సాక్షిగా..

రౌడీయిజం



కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మన్మథపై పిడిగుద్దుల వర్షం కురిపిస్తున్న టీడీపీ మూకలు

- కాశీబుగ్గ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తులపై హత్యాయత్నం
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అనుచరులను పోలీస్‌స్టేషన్‌లోనే చితకబాదిన టీడీపీ నాయకులు
- పోలీసులు ప్రాధేయపడినా వెనక్కి తగ్గని టీడీపీ గూండాలు
- ఏం చేయలేకపోయిన రక్షక భటులు
- జిల్లాలో వరుస సంఘటనలతో ప్రజల్లో ఆందోళన



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ప్రశాంతమైన శ్రీకాకుళంలో టీడీపీ నాయకులు చిచ్చు పెడుతున్నారు. అధికారం చేతిలో ఉండడంతో ఇష్టానుసారం రెచ్చిపోతున్నారు. ఆ మధ్య ఆమదాలవలస నియోజకవర్గంలో.. ఇటీవల శ్రీకాకుళంలో.. తాజాగా పలాసలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనం.

కొన్ని రోజుల కిందట బూర్జ మండలం నారాయణపురం వద్ద ఇసుక అక్రమాలు అడ్డుకుంటున్న వ్యక్తి కారును అడ్డగించి, కారులోంచి లాగి వెదురుకర్రలతో దాడి చేశారు. ఇటీవల శ్రీకాకుళంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద పార్కింగ్ చేసి ఉన్న కారును తీయమన్నందుకు అక్కడి సిబ్బందిని చితకబాదారు. బలగ మెట్టు వద్ద ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నారన్న అక్కసుతో సనపల సురేష్ అనే వ్యక్తిని 20మందికి పైగా టీడీపీ కార్యకర్తలు రౌడీల్లా చుట్టుముట్టి రాళ్లతో దాడి చేశారు. తాజాగా కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తులపై పోలీసుల సమక్షంలోనే స్టేషన్‌లోపల విచక్షణరహితంగా దాడి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులకు లైసెన్సు ఇచ్చినట్టుగా జిల్లాలో రెచ్చిపోతుతున్నారు. వీరి వైఖరితో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో రౌడీల్లా వీరంగం

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పర్సనల్ పీఏ, వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లు రమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మొదలవలస మన్మధరావుపై పోలీసు స్టేషన్‌లో పోలీసుల సాక్షిగా శనివారం రాత్రి తెలుగుదేశం నాయకులు, రౌడీలు దాడులకు పాల్పడ్డారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులోని నిత్య ప్రైవేటు ఆస్పత్రి ఎదురుగా అల్లు రమణ, వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా సభ్యులు వెణుగోపాలరెడ్డితో పాటు మరో ఇద్దరు ఉన్నారు. వీరిని చూసిన పలాస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన కొర్ల విష్ణుచౌదరి తన ఏర్టిగా కారుతో వారి వద్దకు వచ్చి కత్తితో ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. ఈ తరుణంలో తప్పించుకున్న అల్లు రమణ వాదులాటలో దొరికిన కత్తితో కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు చేరుకుని, జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు రాస్తుండగా టీడీపీ గూండాలు వచ్చి ఒక్కసారిగా దాడి చేశారు. అక్కడకు తౌలు త విష్ణు చౌదరి, బద్ద నాగరాజు, వజ్జ బాబూరావు, పీరుకట్ల విశాల్, సప్ప నవీన్, టంకాల రవిశంకర్ చేరుకుని, రమణతో వాగ్వాదం చేశారు. ఈలోపు వెనకనుంచి మరికొంతమంది వ్యక్తులొచ్చి ఒక్కసారిగా రమణతోపాటు ఆయనకు తోడుగా వచ్చిన మొదలవలస మన్మధ పై విరుచుకుపడ్డారు. పోలీసు స్టేషన్ అని చూడకుండా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

ఉద్యోగాలు పోతాయని పోలీసులు చెబుతున్నా..

భారీ సంఖ్యలో తరలివచ్చిన పచ్చ మూకలు ఒక్కసారిగా పోలీసు స్టేషన్‌లో బీభత్సం సృష్టించాయి. తమ జాగీరులా పోలీసు స్టేషన్‌లోనే రౌడీయిజం చేశాయి. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రమణ, మన్మధలపై టీడీపీ మూకలు దాడులు చేస్తుంటే పోలీసులు సైతం అడ్డుకోలేకపోయారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను సైతం పక్కకు తోసేశారు. మీరిలా పోలీసు స్టేషన్‌లో కొడుతుంటే మా ఉద్యోగాలు పోతాయని పోలీసులు ప్రాధేయపడినా టీడీపీ రౌడీలు వెనక్కి తగ్గలేదు. మరింత రెచ్చిపోయి రాజకీయంగా తమకు అడ్డంకిగా మారారన్న కసితో రమణ, మన్మధలను కసితీరా దాడి చేశారు.

కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అల్లు రమణపై దాడి చేస్తున్న దృశ్యం



పోలీసుల ఎదురుగానే..

బయట ఎవరిపై అయినా దాడి జరిగితే పోలీస్‌స్టేషన్‌కు వెళ్తారు. కానీ ఇక్కడ పోలీస్‌స్టేషన్ వేదికగానే టీడీపీ నాయకులు రౌడీయిజానికి పాల్పడ్డారు. టీడీపీ నాయకులు చేసిన గూండాయిజం, దాడి అంతా సెల్‌ఫోన్‌లో రికార్డు చేయడంతో వారి నిజ స్వరూపం ప్రపంచానికి తెలిసింది. లేదంటే గుట్టు చప్పుడు కాకుండా ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిదే తప్పు అని తిరిగి కేసు పెట్టేసేవారు. కూటమి ప్రభు త్వం రాజ్యాంగం కూడా ఇలాగే నడుస్తోంది. తాజా ఘటనే కాదు రెండు నెలల కిందట కూడా ఇదే పోలీసు స్టేషన్‌లో కిష్ణుపురానికి సంబంధించిన టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు మధ్య వివాదంలో విచారణకు పిలిచి వైఎస్సా ర్ సీపీ నాయకుడిపై పోలీసు స్టేషన్ సాక్షిగా రక్తం కారే విధంగా దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీస్ స్టేషన్‌లోనే రక్షణ లేకపోతే సమాజంలో తిరగలేమని, ప్రజల ప్రాణాలకు భద్రత ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో దమయంతి అనే దళిత మహిళపైనా దాడికి పాల్పడ్డారు.

● సీదిరి హౌస్ అరెస్టు



అప్పలరాజు ఇంటి ముందు పోలీసులకు, కార్యకర్తలకు, నాయకుల మధ్య తోపులాట

కాశీబుగ్గ: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్టు చేశారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి, బాలికపై టీడీపీ నేత దాడిని ఖండిస్తూ పోలీసు స్టేషన్ ముట్టడికి పార్టీ శ్రేణులతో వెళ్తుండగా ఆదివారం ఉదయం ఆయన ఇంటి వద్ద కాశీబుగ్గ సీఐ మోహనరావుతో పాటు సిబ్బంది ఆయనను నిలువరించి ఇంటికే పరిమితం కావాలని చెప్పారు. దీంతో అక్కడ వాగ్వాదం జరిగింది. ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఎస్ఐలు, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ సుమారు ముప్పై మందికిపైగా పోలీసు బందోబస్తుతో కట్టడి చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు 'గౌతు శిరీష డౌన్.. డౌన్' టీడీపీ దౌర్జన్య కాండ ఆపాలి అంటూ నినదించారు. బాలికపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి శిక్షించాలని డిమాండ్ చేశారు.

అప్రకటిత ఆంక్షలు..

కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో తెలుగుదేశం నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై చేసిన దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, అనుచరులను హౌస్ అరెస్టు చేయడంతో కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో ఆదివారం 144 సెక్షన్ విధించారు. స్టేషన్‌కు నలుమూలలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కాశీబుగ్గ పోలీసులు, డీఎస్పీ కార్యాలయం నుంచి 144 సెక్షన్‌పై ఎలాంటి ప్రకటన సైతం విడుదల చేయకుండా, ప్రచారం లేకుండా అమలు చేశారు.



మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును నిలువరిస్తున్న పోలీసులు

● పలాసలో అరాచకం రాజ్యమేలుతోంది

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో ఎమర్జెన్సీ కాలం నాటి వాతావరణం చోటుచేసుకుంటోందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అరాచకాలు పెరిగిపోయాయన్నారు. విప్లవాలకు మారుపేరైన ఈ ప్రాంతం ఓ కుటుంబం చేతిలో 60 ఏళ్లు నలిగిపోయిందని, ఈ ప్రాంతంపై ఒకప్పుడు నెగెటివ్ ఇమేజ్ ఉండేదని, అందుకే పలాస 1978 అని సినిమా కూడా వచ్చిందని తెలిపారు. ఆదివారం పోలీసు స్టేషన్‌కు బయలుదేరిన ఆయనను పోలీసులు హౌస్ అరెస్టు చేసి అడ్డుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో కొత్త ప్రాజెక్టులు, పథకాలు, రోడ్ల విస్తరణ, హార్బర్, పోర్టు, కిడ్నీ ఆస్పత్రి, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు తీసుకువచ్చామని, పత్రికల్లో పలాస పేరు మార్మోగేదని, ఇప్పుడు చూస్తే పలాసలో అత్యాచారాలు, పొడవడాలు, కొట్లాటలు, దాడులు, కేసులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం నాయకుడు బాలికపై దాడి చేస్తే పోక్సో కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ రోజు తనను అడ్డుకున్నా మళ్లీ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామన్నారు. పోలీసులు స్పందించకపోతే స్టేషన్‌కు పసుపు రంగు వేసి జనాలను రావద్దని కోరుతామన్నారు. కాశీబుగ్గ స్టేషన్‌లోనే టీడీపీ నాయకులు దాడికి దిగారని, కానిస్టేబుల్‌కు కూడా దెబ్బలు తగిలాయని ఎస్పీ తక్షణమే స్పందించాలని కోరారు. స్టేషన్‌లో దాడి చేసిన వ్యక్తుల్ని పట్టుకుని చర్యలు చేపట్టలేకపోతున్నారని, బాలికపై దాడి చేసినా ఏదో నామమాత్రానికి కేసు పెట్టి వదిలేశారని విమర్శించారు. పలాసను పాత పలాసకు తీసుకునిపోతున్నారని జనం భయపడుతున్నారని అన్నారు. ఈ పరిస్థితులు చూస్తుంటే స్థానిక ఎమ్మెల్యేకు చాలా సంతోషంగా ఉంటుందని చురకలు అంటించారు. 'ఎమ్మెల్యే గారూ.. మీరు అత్యాచార నిందితులకు సాయపడలేదా మీ సీసీ ఫుటేజి చెక్ చేయండి. మీటింగ్ పెట్టండి.' అంటూ సవాల్ విసిరారు. బాలికను తమతోనే డ్యాన్స్ వేయాలని డిమాండ్ చేసి టీడీపీ నాయకుడు కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆయనను ఎమ్మెల్యే కాపాడుతున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం అంతమైతేనే మళ్లీ ప్రజలకు ప్రశాంత వాతావరణం వస్తుందన్నారు.

● బరితెగిస్తున్న టీడీపీ గూండాలు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం శృతి మించుతోందని, దాని పేరుతో టీడీపీ గూండాలు బరితెగించి దాడులు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కాశీబుగ్గలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పోలీస్‌స్టేషన్‌లోనే టీడీపీ గూండాలు దాడి చేయడాన్ని కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమపై కత్తితో దాడి చేశారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తే అక్కడకు వచ్చి కొట్టడం దారుణమన్నారు. ఇలాంటి దాడులను పోలీసులు ఉపేక్షిస్తే వారి ఆగడాలకు హద్దు లేకుండా పోతుందని అన్నారు. వెంటనే వీరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సహనం కోల్పోవద్దని శాంతి పాటించాలని కృష్ణదాస్ సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

చార్జీల పెంపు ప్రతిపాదన సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల పెంపు ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. సోంపేట పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో సీపీఎం మండల మహాసభను ఆదివారం నిర్వహించారు. సోంపేటలో ర్యాలీ, పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహాసభలో పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ ఇంధన చార్జీల పెంపుతో రాష్ట్రంలో ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం పడుతుందన్నారు. ఈ భారాన్ని ప్రజల నెత్తిన వేయడం సమంజసం కాదన్నారు. నిత్యావసర వస్తువులు సామాన్యులకు అందుబాటులో లేవని గుర్తు చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావు, మండల నాయకులు సంగారు లక్ష్మినారాయణ, టి.పాపారావు, డి.హేమయ్య పాల్గొన్నారు.

● సముద్ర తీరం.. పూలహారం



అక్కుపల్లి శివసాగర్ తీరంలో అల్లుకుపోయిన బేడ తీగ పువ్వుల శోయగం కనువిందు చేస్తోంది. ఓ వైపు పచ్చని చెట్లు, సముద్రం మీదగా వీచే చల్లని గాలులు, అలలు సవ్వడి మధ్య ఈ కుసుమాలు ఆహ్లాదం పంచుతున్నాయి.

– వజ్రపుకొత్తూరు రూరల్

నవంబరు నుంచి నైపుణ్య గణన



స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నవంబర్ మొదటి వారం నుంచి జిల్లాలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సెస్)కు శ్రీకారం చుడుతున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నైపుణ్య గణన దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో చేయబోతున్న ఒక గొప్ప ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 29వ తేదీన జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని, దీని కోసం మాస్టర్ ట్రైనర్ల ఎంపిక ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తి స్థాయి శిక్షణ అనంతరం వారంతా మండల, మున్సిపాలిటీ స్థాయిలలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఉన్న సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తారని, సంబంధిత వివరాలు నైపుణ్యం అనే అప్లికేషన్ (యాప్) ద్వారా సేకరిస్తారన్నారు. ఈ గణన పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి, జిల్లా ఉపాధి అధికారిని నోడల్ అధికారులుగా నియమించామని, సచివాలయ సిబ్బందిని ఇందులో భాగస్వాములుగా చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆదిత్యునికి విశేష పూజలు



విశిష్ట దర్శన భక్తులకు రెండు లడ్డూలను ఇస్తున్న ఆలయ ఉద్యోగి శ్రీనివాసరావు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధి ఆదివారం ఇతర ప్రాంతాల భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచి భక్తుల తాకిడి పెరుగుతూ రావడంతో ఆలయ ఈఓ వై.భద్రాజీ, సూపరింటెండెంట్ కనకరాజుల ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేపట్టారు. ఇక అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యుని మూలవిరాట్టును ప్రత్యేక అలంకరణలో సర్వదర్శనాలకు అనుమతిచ్చారు.

రూ.500 టిక్కెట్టుతో రెండు లడ్డూలు

విశిష్ట దర్శనం (రూ.500)తో ఇద్దరికి దర్శనంతో పాటు రెండు లడ్డూల ప్రసాదాలను ఉచితంగా ఇచ్చే ప్రక్రియను ఆదివారం ఆలయ ఈఓ వై.భద్రాజీ ప్రారంభించారు. ఈ మేరకు క్యూలైన్లలో వచ్చి రూ.500 టిక్కెట్లు తీసుకున్న భక్తులకు దర్శనానికి ముందుగానే ఈ ప్రసాదాలను అందజేశారు. ప్రతి ఆదివారం ఇదే విధానం కొనసాగుతుందని ఈఓ ప్రకటించారు. గతంలోనూ ఈ విధానం అమలులో ఉండగా ఇప్పుడు మళ్లీ ప్రారంభించారు.

స్ఫూర్తి కథానావిక



ఫిజికల్ ఫిట్‌నెస్ సాధన చేస్తున్న శ్రీనిధి

- నావికా దళంలో ఉద్యోగం సాధించిన శ్రీనిధి
- డిగ్రీ చదువుతూనే ఏడాదిగా నేవీ పరీక్షలకు సన్నద్ధం
- పేదరికాన్ని అధిగమించి ఉద్యోగం సాధించిన గొర్రెల కాపరి కుమార్తె

మరో ఉద్యోగానికి చేరువలో...

జూలై 2024లో సీబీటీ పరీక్షలో అర్హత సాధించిన శ్రీనిధి విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ శాతవాహనలో ఆగస్టు 2024లో జరిగిన ఫిజికల్, మెడికల్ పరీక్షల్లో విజేతగా నిలిచింది. పరీక్షల ఫలితాలు ఈ నెలలో విడుదలై నేవీలో జీడీ (ఎస్ఎస్ఆర్) ఉద్యోగానికి ఎంపికైంది. మరో పక్క ఏప్రిల్ 30, 2024న విశాఖపట్నంలోనే జరిగిన ఉమెన్ మిలటరీ పోలీస్ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఆ ఉద్యోగానికి కూడా చేరువైంది.

వజ్రపుకొత్తూరు: తండ్రి గొర్రెల కాపరి.. కుటుంబానిది అతి సామాన్య నేపథ్యం.. అయినా ఆమె కలలు కనడం మానలేదు. ఎన్ని అడ్డు గోడలు ఉన్నా.. ఎన్ని అవరోధాలు ఎదురైనా లక్ష్యంపై మాత్రమే దృష్టి పెట్టింది. అన్నింటినీ దాటుకుని 19 ఏళ్ల వయసులోనే నేవీ ఉద్యోగం సాధించింది వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన బందాపు శ్రీనిధి. ఆమె సాధించిన ఈ విజయం స్ఫూర్తిదాయకంగా నిలవనుంది.

ఇదీ నేపథ్యం..

శ్రీనిధి తండ్రి బందాపు తేజేశ్వరరావు గొర్రెల కాపరి(పెద్ద కోనారి). తల్లి గౌరి గృహిణి. చెల్లి శ్రీజ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. శ్రీనిధి మొదటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదివింది. ఆమె పెదనాన్న బందాపు గణపతిరావు ఇండియన్ ఆర్మీలో సుబేదార్‌గా విధులు నిర్వహించడం చూసి ఆయనను స్ఫూర్తిగా తీసుకుంది. బాబాయ్ బందాపు తిరుమలరావు ప్రోత్సాహంతో నేవీలో కొలువు సాధించాలని కలలు కన్నది.

నేవీ కొలువు అంటే చదువులోనే కాదు శారీరకంగా కూడా చురుగ్గా ఉండాలి. ప్రతి రోజూ వెంకటాపురం – పర్లాకిమిడి రహదారిపై పరుగులో సాధన చేసేది. పుష్‌అప్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం ఇతర ఎక్సర్‌సైజ్‌లు చేసేది. ఏదైనా సాధిస్తేనే సమాజంలో గౌరవం అని గమనించి పట్టుదలలో ఇండియన్ నేవీలో ఉద్యోగం పొందింది. ఇటీవల విడుదలైన ఆలిండియా మెరిట్ జాబితాలో ఎంపికై నవంబరు 11న ఒడిశాలోని చిలకలో శిక్షణ తీసుకోనుంది.



తల్లి గౌరితో శ్రీనిధి

నా కాళ్లపై నేను నిలబడాలి



నా కాళ్లపై నేను నిలబడాలి. దేశానికి సేవ చేయాలనే ఆలోచనతో నేవీ ఉద్యోగం సాధించాను. మాది చాలా సాధారణ కుటుంబం. ఏదైనా సాధిస్తేనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయి. అలాగే ఒకే చోట ఉండిపోకూడదు. లక్ష్యం ఏర్పాటు చేసుకుని ప్రతి రోజూ సాధన చేయాలి. మా పెదనాన్న భారత సైన్యంలో మంచి ఉద్యోగంలో ఉన్నారు. ఆయన నిత్యం ప్రోత్సహించే వారు. మా బాబాయ్ తిరుమల నిత్యం నా వెన్ను తట్టి లక్ష్యం వైపు పయనించేలా సహకరించారు. ఈ విజయం వారికే అంకితం.

– బందాపు శ్రీనిధి

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో పూజల అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ న్యాయమూర్తులు, ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్


స్వాధీనం చేసుకున్న లారీ

నరసన్నపేట: మండలంలోని దేవాది వద్ద రెండు ఇసుక లారీలు, ఒక జేసీబీని అధికారులు శనివారం రాత్రి సీజ్ చేశారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు ఆనుకొని శిథిలమైన గ్రానైట్ ఫ్యాక్టరీ ఆవరణలో లారీల్లో ఇసుకను లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ శనివారం రాత్రి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సీనియర్ అసిస్టెంట్ అన్వేష్, వీఆర్వో త్రినాథరావు ఉన్నారు.

గాయపడిన హోంగార్డుకు పరామర్శ


రేవతిని పరామర్శించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళా హోంగార్డు తమ్మినేని రేవతిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పరామర్శించారు. సరుబుజ్జిలి పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న రేవతి జొన్నవలస వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రేవతిని ఎస్పీ ఆదివారం పరామర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందేలా ఏర్పాట్లు చేశామని భరోసా ఇచ్చారు.

అంతర్జాతీయ సదస్సులో సుబ్రహ్మణ్యం


ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన ఆంగ్ల అధ్యాపకుడు డి.హెచ్. సుబ్రహ్మణ్యం ప్రతిష్టాత్మక సదస్సులో ప్రసంగించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతి వేదికగా ది అస్సాం రాయల్ గ్లోబల్ యూనివర్సిటీలో జరిగిన 18వ అంతర్జాతీయ ఆంగ్లభాష సదస్సులో జి.సిగడాం మోడల్ స్కూల్ ఆంగ్ల అధ్యాపకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. తాను రాసిన 'ది పవర్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్ ఇన్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ లెర్నింగ్' అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేసి ఆకట్టుకున్నారు.

పాతపట్నంలో జాబ్‌మేళా రేపు

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు ఆదివారం తెలిపారు. అపోలో ఫార్మసీ, ఇన్‌వోసోర్స్, జాబ్ డీలర్స్‌తో పాటు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, ఐటీఐ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు 9553292734 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆగని ఇసుక దందా

- ఉచితం పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీ
- దంతవరపుకోట, మునగవలస, పెదమాలపేటలో అక్రమ నిల్వలు
- 'స్థానిక అవసరాల' నిబంధనకు తూట్లుపొడుస్తూ విక్రయాలు
- అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే..


పెద్దపాలెం శివాలయం వద్ద నిల్వచేసిన ఇసుకపోగులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఇసుక ఉచితమంటూ కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. సరుబుజ్జిలి మండలం వంశధార నదీతీర పరీవాహక ప్రాంతాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తరలించుకోవచ్చని ప్రభుత్వం చేసిన ప్రకటనను కొందరు టీడీపీ నేతలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛ సాగిస్తున్నారు. సచివాలయం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే పంచాయతీ పరిధి దాటి ఉచితం మాటున ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసి పలు ప్రాంతాల్లో అక్రమ నిల్వలు చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీల ద్వారా భారీ లారీలకు ఇసుక లోడింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ నిల్వ కేంద్రాలివే..

సరుబుజ్జిలి మండలంలోని దంతవరపుకోట, రొట్టవలస సమీపంలోని మునగవలస స్టోన్ క్రషర్, పెద్దపాలెం శివాలయం, పెదమాలపేట గ్రామాల వద్ద వంశధార తీర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకొచ్చి అక్రమంగా నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు చెందిన లారీల్లో లోడింగ్ చేసి రవాణా చేస్తున్నారు. ప్రతి లారీకి రూ.15 వేలు నుంచి రూ.18 వేలు వరకు వసూలు చేసి భారీగా దోపిడీకి పాల్పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

పట్టపగలే లారీలకు ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండా జేసీబీల ద్వారా ఇసుక లోడ్ చేసి రవాణా జరుగుతున్నప్పటికీ పోలీస్, రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీల పరిధి దాటి ఇసుక రవాణా చేయరాదని తీర ప్రాంత ఇసుక ర్యాంపుల వద్ద ప్రభుత్వం కానిస్టేబుళ్లను కాపలాగా పెట్టినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అతివేగంతో వెళుతున్న ఇసుక వాహనాల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారినపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.

టీడీపీ నేతలదే కీలకపాత్ర......

ట్రాక్టర్ల ద్వారా తీసుకొస్తున్న ఇసుకను నిల్వ చేసి, లారీలద్వారా ఇతర ప్రాంతాలకు తరలించడంలో కొంతమంది టీడీపీ నేతలు ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ముగనవలస సమీపంలోని ఓస్టోన్ క్రషర్, దంతవరపుకోట ప్రదేశాల నుంచి అధికంగా లారీలు అడ్డదారుల్లో తరలిపోతున్నట్లు తెలుస్తోంది.


మునగవలస క్వారీలో ఇసుక నిల్వలు


కేసులు నమోదు చేస్తాం

ఇసుకను స్థానిక అవసరాల మేరకు మాత్రమే వినియోగించాలి. అనధికారంగా నిల్వచేసినా, లారీల ద్వారా తరలించినా పట్టుకొని కేసులు నమోదు చేస్తాం.

– ఎల్.మధుసూదన్, సరుబుజ్జిలి తహసీల్దార్

చిట్టి పాపకు పెద్ద కష్టం

- ఆరు నెలలుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారి
- బెంగళూరులో శస్త్ర చికిత్సకు రూ.40లక్షలు అవసరం
- దాతల వైపు తల్లిదండ్రుల చూపు


చిన్నారి నిషా

ఇచ్ఛాపురం రూరల్: అల్లారుముద్దుగా పెరిగిన ఇంటి దీపానికి ఆపద వచ్చిందని, తమ పాపకు ప్రాణభిక్ష పెట్టాలని ఆ పేద తల్లిదండ్రులు దాతలను వేడుకుంటున్నారు. ఇచ్ఛాపురం మండలం బిర్లంగి గ్రామానికి చెందిన కొరికాన లక్ష్మీనారాయణ, జ్యోతి దంపతుల గారాలపట్టి ఆరేళ్ల నిషా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. నాలుగు నెలల క్రితం తోటి చిన్నారులతో ఆడుతూ స్పృహతప్పి కింద పడిపోయి పక్షవాతం బారిన పడింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు చేయగా.. డాక్టర్లు పిడుగులాంటి వార్తను తల్లిదండ్రులకు తెలిపారు. చిన్న మెదడులోని నరాల మధ్య చిన్నపాటి కణితి ఉందని, బ్రెయిన్ ట్యూమర్‌గా పిలిచే ఈ కణితిని బెంగళూరులోని కార్పొరేట్ ఆసుపత్రిలో మాత్రమే తొలగించగలరని తెలిపారు. అప్పటికే ఆరోగ్యశ్రీతో కలిపి లక్ష రూపాయల వరకు వైద్యం చేసిన తల్లిదండ్రులు హతాశులయ్యారు. తండ్రి లక్ష్మీనారాయణ డ్రైవర్‌గా ట్రాక్టర్, కార్లు నడుపుతుండగా, తల్లి జ్యోతి గృహిణి. అసలే పేదరికం, ఆపై తమ కంటిపాపకు పెద్ద కష్టం రావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బెంగళూరులో శస్త్ర చికిత్స చేయాలంటే కనీసం రూ.40లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో దాతల కోసం ఎదురుచూస్తున్నారు. తమ పాపకు ప్రాణభిక్ష పెట్టాలంటూ కోరుతున్నారు.

ఫోన్‌పే నెంబర్ :	94410 44376	(కె.లక్ష్మీనారాయణ)
బ్యాంకు ఖాతా నెం :	6821571514	(ఇండియన్ బ్యాంక్)
ఐఎఫ్ఎస్ కోడ్ :	ID1B001071	

విద్యుత్ చార్జీలు పెంచడమే దీపావళి కానుకా?

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు సర్దుబాటు చార్జీల పేరిట రూ.6 వేల కోట్ల విద్యుత్ భారం మోపడం అన్యాయమని, ఇదేనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే దీపావళి కానుకా? అని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు తనకు అధికారం ఇస్తే విద్యుత్ చార్జీలు పెంచనని ఊదర కొట్టారని, ఇప్పుడు ఐదు నెలల్లోనే మాట మార్చి చార్జీల పెంపునకు అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. చంద్రబాబు హామీలు నెరవేర్చకుండా ఎప్పుడూ జగన్‌పైనే బురదజల్లుతూ కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. చార్జీలు పెంపు నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు షర్మిలతోడైవర్షన్ పాలిటిక్స్ చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తానని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ తన పదవిని కాపాడుకునేందుకు రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను నిలదీయకుండా చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నారని, కనీసం జనసేన కార్యకర్తలకు జరుగుతున్న అవమానాలను కూడా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. సమావేశంలో ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో శాన్వి సంచలనం



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన లట్టాల శాన్వి షటిల్ బ్యాడ్మింటన్‌లో సంచలనం సృష్టించింది. అస్సాం రాష్ట్రం డిబ్రుగర్‌లో జరుగుతున్న ఆలిండియా అండర్–13 సబ్ జూనియర్స్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2024లో మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. పాతపట్నంకు చెందిన ఈ చిన్నారి హైదరాబాద్‌లోని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. తొమ్మిదేళ్ల పిన్న వయసులోనే అండర్–13 ఆలిండియా ర్యాంకింగ్ టోర్నీలో మెయిన్‌డ్రాకు అర్హత సాధించి రికార్డు నెలకొల్పిందని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్, హెడ్ కోచ్ వేణు ముప్పాల పేర్కొన్నారు. తండ్రి సాయిశ్రీరామ్ సినిమాటోగ్రాఫర్ కాగా తల్లి ఖుషి గృహిణి. బ్యాడ్మింటన్‌లో శాన్వికి మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా బాడ్మింటన్ అధ్యక్ష,కార్యదర్శులు కిల్లంశెట్టి సాగర్, మెట్ట అశోక్‌కుమార్, సీఈఓ, ఇంటర్నేషనల్ అంపైర్ సంపతిరావు సూరిబాబు సంతోషం వ్యక్తం చేశారు.

స్కూల్‌గేమ్స్‌లో శ్రీకాకుళం జైత్రయాత్ర


రన్నరప్ ట్రోఫీ, పతకాలతో హ్యాండ్‌బాల్ జట్టు క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు


రన్నరప్ ట్రోఫీ, పతకాలతో ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు, మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ:

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జైత్రయాత్ర కొనసాగుతోంది. 2024–25 సీజన్‌లో శ్రీకాకుళం జట్లు తామాడిన అన్ని క్రీడాకారుల్లోనూ మొదటి మూడు స్థానాల్లో నిలుస్తూ సత్తా చాటుతున్నారు. తాజాగా హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ద్వితీయ స్థానాలు సాధించి శభాష్ అనిపించారు. విజయనగరం జిల్లా కొత్తవలస వేదికగా ఈ నెల 25 నుంచి 27 వరకు ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) అండర్–19 హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం బాలురు జట్టు రన్నరప్‌గా నిలిచి రజత పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఆర్.సతీష్‌రాయుడు, డి.ఈశ్వరరావులు జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించారు. అదే విధంగా, ఈనెల 25 నుంచి 27 వరకు అనంతపురం జిల్లాలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) అండర్–17 బాలబాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి టైటిల్, రజత పతకాలు సాధించారు. పలువురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ జట్టుకు గణపతి, శ్రీను కోచ్ మేనేజర్లుగా వ్యవహరించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ జట్లు రాణింపు పట్ల డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, మెట్ట తిరుపతిరావు, గురుగుబెల్లి రాజశేఖర్, జిల్లా హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కోచ్‌లు హర్షం వ్యక్తంచేశారు.

సెంచూరియన్‌లో విలువలతో కూడిన విద్య




మాట్లాడుతున్న డీన్ ప్రఫుల్ కుమార్ పండా


హాజరైన వర్సిటీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు ఎంచుకున్న రంగంలో సాంకేతికతను జోడించడంతోపాటు విలువలతో కూడిన విద్యను అందించడంలో సెంచూరియన్ యూనివర్సిటీ ముందు వరుసలో ఉంటుందని సెంచూరియన్ యూనివర్సిటీ(పర్లాకిమిడి) బీటెక్ డీన్ డాక్టర్ ప్రఫుల్‌కుమార్ పండా పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఓ హోటల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్లాకిమిడిలో సెంచూరియన్ యూనివర్సిటీతోపాటు అనుబంధంగా మరో ఆరు బ్రాంచ్‌లను కలిగి ఉందన్నారు. డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ ఎస్.కామేశ్వరరావు, డాక్టర్ చంద్రకాంతరెడ్డి తదితరులు మాట్లాడుతూ సెంచూరియన్ యూనివర్సిటీ నాక్ ఏ+ గ్రేడ్‌ను సొంతం చేసుకోవడంతోపాటు ఉత్తరాంధ్రాలోనే అత్యధిక ప్లేస్‌మెంట్లను సాధిస్తున్న వర్సిటీగా పేరుగాంచిందన్నారు. పిల్లల చదువులపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలన్నారు. తరచూ వర్సిటీని, గ్రూప్ ఇన్‌చార్జి, హెచ్‌ఓడీ, మెంటార్‌లను సంప్రదిస్తుండాలని సూచించారు. తరగతుల సమయంలో సెల్‌ఫోన్లు వినియోగించకుండా జాగ్రత్తపడాలన్నారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌బాబు, ఐక్యూఏసీ డాక్టర్ ఎంసీ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, వివిద విభాగాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

ఆమదాలవలస : ఆమదాలవలస పట్టణంలోని కండ్రపేట సమీపంలో ఆదివారం మధ్యాహ్నం 5.2 కిలోల గంజాయితో నలుగురు పట్టుబడ్డారని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్‌కు వచ్చిన సమాచారం మేరకు కండ్రపేట శ్మశానవాటికలో దాడులు నిర్వహించగా.. కండ్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన షేక్ ఆరిఫ్, పర్లాకిమిడికి చెందిన సాగిపల్లి చరణ్ తోపాటు మరో బాలుడు గంజాయి పంచుకుంటూ పట్టుబడినట్లు చెప్పారు. ఆ సమయంలో మరో ముగ్గురు పోలీసులకు దొరక్కుండా పారిపోయారని తెలిపారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పర్లాకిమిడి నుంచి కొంతమంది వ్యక్తుల ద్వారా గంజాయి అక్రమ రవాణా సాగిస్తున్నారని, వారిని సైతం పట్టుకుంటామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, మత్తుపదార్థాల రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 11 గంటల తర్వాత అకారణంగా రోడ్లపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు


రణస్థలం: మండలంలోని తెప్పలవలస పంచాయతీ నీలంపేట సమీప తోటల్లో జరుగుతున్న కోడి పందేల శిబిరంపై జె.ఆర్.పురం పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉమ్మడిగా ఆదివారం దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.32020 నగదు, 9 కోళ్లు, 8 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు, 14 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.చిరంజీవి చెప్పారు.

గడ్డి మందు తాగి విద్యార్థి ఆత్మహత్య


లచ్చన్న(ఫైల్)

ఆమదాలవలస: మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన గురుగుబెల్లి లచ్చన్న (18) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కె.వెంటేశ్వరరావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న లచ్చన్న వ్యసనాలకు లోనై, తల్లిదండ్రుల మాట పెడచెవిని పెడుతుండేవాడు. చదువుపై దృష్టి సారించడంలేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన శనివారం గ్రామ శివారులో గడ్డిమందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. లచ్చన్నకు తల్లిదండ్రులు సూర్యనారాయణ, లక్ష్మి, తమ్ముడు దుర్గాప్రసాద్ ఉన్నారు. అందివచ్చిన కొడుకు అందనంత లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఎస్‌ఐ కె.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాలే భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఐక్యవేదిక నాయకులు

సోంపేట: పుస్తకాలే భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలని, సోంపేట ఉద్యమ విజయం పుస్తక రూపం దాల్చడం అభినందనీయమని పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు అన్నారు. సోంపేట పట్టణంలోని కలాసీ సంఘ భవనంలో 'మన బీల కోసం – బతుకు కోసం' పుస్తక పరిచయ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పుస్తకం ద్వారా ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు అందుతుందన్నారు. పుస్తక రచయిత, మానవ హక్కుల ప్రతినిధి కె.అనురాధ మాట్లాడుతూ సోంపేట థర్మల్ ఉద్యమం అనేక పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కృష్ణ, నాగు, వెంకన్న, తెలుకులు గౌరీశంకర్, బత్తుల శంకరరావు, తోట మోహనరావు, బార్ల సుందరరావు, నెయ్యిల విజయ్‌కుమార్, బల్లెడ కృష్ణరావు, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యం


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఈవో తిరుమలచైతన్య

శ్రీకాకుళం: శాస్త్రీయ సమాజ నిర్మాణ ధ్యేయమని డీఈవో తిరుమల చైతన్య, జిల్లా సైన్స్ అధికారి నల్ల కుమారస్వామి అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ముందుగా చెకుముకి ప్రశ్నపత్రాలను డీఈవో ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప విద్యాశాఖాధికారి కె.అప్పారావు, నల్లి ధర్మారావు, విష్ణుమూర్తి, ఎస్.సాయిశ్రీనివాస్‌శర్మ, పి.కూర్మారావు, కె.కామేశ్వరరావు, గిరిధర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.